## క్లుప్తంగా

### మంత్రి విశ్వరూప్ పరామర్శ



జి.అగ్రహారంలో సుబ్బారావు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న మంత్రి విశ్వరూప్

**అంబాజీపేట:** గంగలకుర్రు అగ్రహారానికి చెందిన విశ్రాంత ఇన్‌చార్జి ఎంపీడీఓ విత్తనాల సుబ్బారావు సోమవారం మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను రాష్ట్ర రవాణా శాఖా మంత్రి పినిపే విశ్వరూప్ బుధవారం పరామర్శించారు. సుబ్బారావు కుమారుడు శేఖర్, కోడలు దుర్గాభవానీలను పరామర్శించి ఓదార్చారు. తొలుత సుబ్బారావు చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పేరి శ్రీనివాస్, గణపతి వీరరాఘవులు, బొంతు పెదబాబు, మట్టపర్తి నాగరాజు, ఇళ్ల గోపి, వాసంశెట్టి పెదబాబు తదితరులు ఉన్నారు.

### విద్యార్థికి ఎమ్మెల్యే అభినందన



జయశ్యామ్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

**రావులపాలెం:** పదో తరగతిలో 561 మార్కులు సాధించి కొత్తపేట మండలంలో మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్న కొత్తపేట శ్రీనివాస నగర్‌కు చెందిన నెల్లి రవివర్మ, నాగజ్యోతిల కుమారుడు నెల్లి జయశ్యామ్‌ను బుధవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అభినందించారు. గోపాలపురంలోని ఎమ్మెల్యే స్వగృహం వద్ద జరిగిన కార్యక్రమంలో జగనన్న ఆణిముత్యాలు అవార్డు, మెడల్ అందజేశారు. భవిష్యత్తులో ఐఐటీకి ఎంపికై మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

### కార్యనిర్వహణాధికారిగా లక్ష్మి

**అంబాజీపేట:** స్థానిక మండల పరిషత్ కార్యాలయ కార్యనిర్వహణాధికారిగా బీవీవీఎస్ఎస్ లక్ష్మి బుధవారం బాధ్యతలు స్వీకరించినట్లు ఎంపీడీఓ కె.సత్యనారాయణ తెలిపారు. కాకినాడ ఇంజినీరింగ్ కార్యాలయంలో కార్యనిర్వహణాధికారిగా విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారన్నారు.

### జనరేటర్ బహూకరణ



జనరేటర్‌ను ప్రారంభిస్తున్న దాత దంతులూరి, అసిస్టెంట్ కమిషనర్ సత్యనారాయణ

**సఖినేటిపల్లి:** అంతర్వేది లక్ష్మీనరసింహస్వామివారి దేవస్థానానికి బుధవారం సఖినేటిపల్లికి చెందిన దాత దంతులూరి కుమారవరప్రసాద వెంకట సత్యనారాయణరాజు, అతని కుటుంబ సభ్యులు కలసి జనరేటర్ బహూకరించారు. దీనిని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణకు అప్పగించారు. ఆలయ ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్, స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, వేద పండితుడు చింతా వెంకటశాస్త్రి, అర్చకులు పూజలు నిర్వహించారు. అనంతరం జనరేటర్‌ను దాత దంతులూరి, ఏసీ సత్యనారాయణ ప్రారంభించారు.

### మార్కెట్ యార్డ్ పరిశీలన



అరటి మార్కెట్ యార్డును పరిశీలిస్తున్న మార్కెటింగ్ కమిషనర్ రాహుల్ పాండే

**రావులపాలెం:** స్థానిక అరటి మార్కెట్ యార్డ్‌ను బుధవారం రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ కమిషనర్ రాహుల్ పాండే సందర్శించారు. అరటి క్రయ విక్రయాలను పరిశీలించారు. రాజమహేంద్రవరంలో జరిగిన కార్యక్రమానికి హాజరైన ఆయన తిరుగు ప్రయాణంలో స్థానిక మార్కెట్ యార్డ్ వద్ద కాసేపు ఆగారు. మార్కెట్ యార్డ్‌ను పరిశీలించి స్థానిక రైతులతో అరటి కొనుగోలు, అమ్మకాలు జరిగే విధానంపై అడిగి తెలుసుకున్నారు. మార్కెట్ యార్డ్‌లో జరుగుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై ఉన్నత శ్రేణి కార్యదర్శి వి.యశ్వంత్‌రావు కమిషనర్‌కి వివరించారు. ఆర్డీడీలు పి.సుధాకర్, కె.శ్రీనివాసరావు, డీడీఎం లావణ్య, మార్కెటింగ్ ఈఈ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

### వ్యక్తిపై కేసు నమోదు

**అంబాజీపేట:** పాత గొడవల నేపథ్యంలో ఓ గర్భిణిపై అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు అంబాజీపేట పోలీసులు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు.. ఇసుకపూడి శివారు పెండిపేటకు చెందిన మోకా వాసు అదే గ్రామానికి చెందిన ఏడు నెలల గర్భిణిపై ఈ నెల 22న అసభ్యకరంగా ప్రవర్తించాడన్నారు. ఆమె కేకలు వేయడంతో అక్కడి నుంచి వాసు పరారయ్యాడన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎ.చైతన్యకుమార్ తెలిపారు.

# రెవెన్యూ డివిజన్

- కొత్తపేట డివిజన్ ఏర్పడి ఏడాది
- ప్రజలకు మరింత చేరువైన పాలన



కొత్తపేట ఆర్డీఓ కార్యాలయంలో ధాన్యం కొనుగోలుపై సమీక్షిస్తున్న ఆర్డీఓ ముక్కంటి (ఫైల్)

**కొత్తపేట: రెవెన్యూ డివిజన్ ఏర్పడి ఏడాదైంది.. ప్రజా సేవకు బాట పడింది.. తద్వారా పరిపాలనా** సౌలభ్యం కలిగింది.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టాక కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్లను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా అమలాపురం కేంద్రంగా 22 మండలాలతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రూపుదిద్దుకుంది. ఈ జిల్లాలో రెండు రెవెన్యూ డివిజన్‌లు ఉండగా కొత్తగా కొత్తపేట డివిజన్ ఏర్పడింది. ఇది ఆవిర్భవించి గురువారంతో ఏడాది పూర్తయ్యింది. కొత్తపేట రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేస్తూ గత ఏడాది జూన్ 29న రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ డివిజన్ ఏర్పాటును ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. దీని ప్రాముఖ్యతను ముఖ్యమంత్రి **వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వివరించి రాష్ట్ర క్యాబినెట్‌లో ఆమోదముద్ర వేయించారు. కొత్తపేట, రావులపాలెం, ఆత్రేయపురం, అంబాజీపేట, పి.గన్నవరం, అయినవిల్లి, ఆలమూరు మండలాలతో కలిపి కొత్త రెవెన్యూ డివిజన్ ఆవిర్భవించింది. ఈ** డివిజన్ పరిధిలో 99 రెవెన్యూ గ్రామాలు, 114 పంచాయతీలు, 148 గ్రామ సచివాలయాలు ఉన్నాయి.

**దూరాభారం తగ్గింది..**

వివిధ మండలాలకు కేంద్ర బిందువుగా కొత్తపేట ఉంది. ఈ రెవెన్యూ డివిజన్ ఏర్పడటంతో ప్రజలకు వ్యయప్రయాసలు తప్పాయి. ఆత్రేయపురం మండలం బొబ్బర్లంక నుంచి అమలాపురం వెళ్లాలంటే సుమారు 65 కిలోమీటర్లు, రావులపాలెం మండల వాసులు 40 కిలోమీటర్లు, కొత్తపేట మండల వాసులకు 30 కిలోమీటర్లు ఉంటుంది. అలాగే ఆలమూరు మండల ప్రజలు రాజమహేంద్రవరం వెళ్లాలంటే 40 కిలోమీటర్లు ప్రయాణించాలి. ఈ తరుణంలో ప్రభుత్వం కొత్తపేట కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయడంతో ఆర్డీఓ అందుబాటులోకి వచ్చారు. దూరభారం తగ్గడంతో పాటు సమస్యలు త్వరితగతిన పరిష్కారం అవుతున్నాయని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కొత్త రెవెన్యూ డివిజన్‌కు తొలి ఆర్డీఓగా ఎం.ముక్కంటి నియమితులయ్యారు. మొదట తహసీల్దార్ కార్యాలయం నుంచే ఆర్డీఓగా బాధ్యతలు నిర్వహించారు. తరువాత స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ పక్కన శెట్టిబలిజ కమ్యూనిటీ హాలును అద్దెకు తీసుకుని దానిలో కార్యాలయం ఏర్పాటు చేయగా అక్టోబర్ 4 నుంచి కార్యకలాపాలు జరుగుతున్నాయి.

**1,344 అర్జీలు, సమస్యల పరిష్కారం**

కొత్త రెవెన్యూ డివిజన్ ఏర్పడిన తరువాత ఇంతవరకూ అధికారుల లెక్కల ప్రకారం 12 అంశాలకు సంబంధించి వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ 1,344 అర్జీలు అందాయి. ఇందులో దాదాపు అన్నీ పరిష్కారం అయ్యాయని కార్యాలయ సిబ్బంది తెలిపారు. ముఖ్యంగా దీర్ఘకాలంగా పరిష్కారం కాని రెవెన్యూ భూములకు సంబంధించి, వివిధ మండలాల పరిధిలో గ్రామ కంఠాలకు సంబంధించిన సమస్యలు ఈ కొత్త రెవెన్యూ డివిజన్ ఏర్పడిన తరువాత పరిష్కారమయ్యాయి.

**పరిపాలనా సౌలభ్యం ఏర్పడింది**



కొత్తపేట కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటుతో ప్రజలకు పరిపాలనా సౌలభ్యం కలిగింది. గతంలో ఆర్డీఓ కార్యాలయానికి అమలాపురం వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు మరింత అందుబాటులో కొత్తపేట డివిజన్ కేంద్రం రావడంతో దూరాభారం తగ్గడమే కాక సమయం కూడా ఆదా అవుతుంది. అన్నింటికీ మించి డివిజన్ పాలనా ఫలితాలు ప్రజలకు వేగంగా అందుతున్నాయి. అనేక దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారమవుతున్నాయి. ప్రజల సమస్యలు వేగంగా పరిష్కారం అవుతున్నాయి.

–చిర్ల జగ్గిరెడ్డి, ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్, కొత్తపేట

**దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారం**



ప్రజలకు ప్రభుత్వ సేవలు చేరువ చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కొత్తగా జిల్లాలు, రెవెన్యూ డివిజన్‌లు ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా కొత్తపేట కేంద్రంగా డివిజన్ ఏర్పాటు చేయడం, దీనికి తొలి ఆర్డీఓగా పనిచేయడం సంతోషంగా ఉంది. తాను బాధ్యతలు చేపట్టిన దాదాపు ఏడాదిలో ఎన్నో సమస్యలు పరిష్కరించాం. పెండింగ్‌లో గ్రామ కంఠాలు ఫైల్స్ క్లియర్ చేశాం. నా పరిధిలో పరిష్కారం అవుతాయనుకున్న ఏ సమస్యలైనా ప్రజలు నిర్భయంగా తెలపొచ్చు.

–ఎం.ముక్కంటి, ఆర్డీఓ, కొత్తపేట

**ఎమ్మెల్యే చొరవతో సాకారం**



కొత్తపేట రెవెన్యూ డివిజన్ ఈ ప్రాంత వాసుల చిరకాల కోరిక. ఇది ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి కృషి ఫలితంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకు సాకారమైంది. గత టీడీపీ హయాంలో అనేక దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారం కాకుండా అమలాపురం ఆర్డీఓ కార్యాలయంలో మూలనపడ్డాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టాక కొత్త డివిజన్ ఏర్పడి గ్రామ కంఠాల సమస్యలు పరిష్కారమయ్యాయి.

–ముత్యాల వీరభద్రరావు, కొత్తపేట

# విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు

**ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు**



మోరిలో పథకాలకు సంబంధించిన బ్రోచర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాదరావు

**సఖినేటిపల్లి:** జగనన్న ప్రభుత్వం విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకు వచ్చిందని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. బుధవారం మోరిలో అధికారులు, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులతో కలసి ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి గడపకూ వెళ్లి సీఎం జగన్ పాలనలో ఆయా కుటుంబాలకు అందించిన సంక్షేమ ఫలాలపై బ్రోచర్లను ఎమ్మెల్యే అందజేశారు. అర్హులకు పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని తెలుసుకుని, అందకపోతే అందించేందుకు అక్కడికక్కడే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలతో పేదలందరికీ మేలు జరుగుతుందన్నారు. అన్ని వర్గాల సంక్షేమానికి పాటుపడుతున్న సీఎం వైఎస్ జగన్‌కు రానున్న కాలంలో ప్రజలంతా అండగా నిలవాలని కోరారు. ఎంపీపీ వీరా మల్లిబాబు, సర్పంచ్ పసలపూడి లక్ష్మీపద్మ మంగతాయారు, ఎంపీటీసీ జాన లక్ష్మీదుర్గ సూర్యావతి, వీవర్స్ సొసైటీ అధ్యక్షుడు జాన శంకరరావు, పార్టీ మండల అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్, గ్రామ శాఖ అధ్యక్షుడు సీహెచ్ రాంబాబు పాల్గొన్నారు.

# పేదల ప్రభుత్వం మాది

- పథకాల అమలులో ఆదర్శం
- ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు



పెదపట్నంలంకలో పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు

**మామిడికుదురు:** వైఎస్సార్ సీపీ పేదల ప్రభుత్వమని, పథకాల అమలులో రాష్ట్రం ముందంజలో ఉందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. బుధవారం పెదపట్నంలంక ధనమ్మపేట, బొక్కావారిపాలెంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే చిట్టిబాబు ప్రతి ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. తాగునీరు రావడం లేదని అక్కడి మహిళలు తెలపగా, జల్‌జీవన్ మిషన్ ద్వారా కొత్తగా పైప్‌లైన్లు వేస్తున్నామని, ప్రతి ఇంటికీ కుళాయిలు ఏర్పాటు చేసి తాగునీరు అందించేందుకు కార్యాచరణ చేపట్టామని ఎమ్మెల్యే చిట్టిబాబు వివరించారు. పథకాల ద్వారా పేదలకు ఎంతో మేలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మీ చల్లని దీవెనలు అందించాలని కోరారు. అభివృద్ధి, సంక్షేమంలో ఎక్కడా మాట తప్పకుండా, మడమ తిప్పకుండా జగన్ పాలన కొనసాగిస్తున్నారని చెప్పారు. ప్రజలు అండగా ఉంటే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము, నేతలు లంకే దుర్గ, రాయుడు ఆనంద్, జోగి వెంకటరామకృష్ణ, విప్పర్తి నాగేశ్వరరావు, వాసంశెట్టి శ్రీరామమూర్తి, మామిడిశెట్టి మనోహర్, ఆకుమర్తి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# సమాజ హితానికి పాటుపడాలి



వ్యాసరచనలో విజేతకు సర్టిఫికెట్ అందజేస్తున్న డాక్టర్ శర్మ, అరుణ్‌కుమార్

**కొత్తపేట:** విద్యార్థులు సమాజ హితానికి పాటుపడాలని జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ సెక్రటరీ డాక్టర్ పీవీఆర్ శర్మ తెలిపారు. స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్.అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ సొసైటీ సౌజన్యంతో స్వచ్ఛంద రక్తదానం, దాని ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ శర్మ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో రక్తహీనత, వివిధ ప్రమాదాల కారణంగా రక్తం పోయి ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో రక్తం ఆవశ్యకత ఎంతో ఉందన్నారు. వయసుతో సంబంధం లేకుండా ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలన్నారు. వ్యాసరచన పోటీల్లో విజేతలు షేక్ సఫియాబేగం, కెదుర్గాభవాని, కె.తేజశ్రీలకు మెమెంటోలు, సర్టిఫికెట్స్ అందజేశారు. జిల్లా వినియోగదారుల సంఘం కార్యదర్శి సత్తిరాజు ఆదిత్యకిరణ్, జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు కామేశ్వరీదేవి, యు.నాగేశ్వరరావు, పెదపూడి బాపిరాజు, ఎస్.భీమేశ్వరరావు, కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

### లక్ష్యాలను సాధించాలి

**కొత్తపేట:** ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్లు (డబ్ల్యూఈఏ) తమ పాత్రను సక్రమంగా నిర్వర్తించాలని ఎంఈఓ మట్టపర్తి హరిప్రసాద్ సూచించారు. బుధవారం స్థానిక విద్యా వనరుల కేంద్రంలో డబ్ల్యూఈఏలతో వివిధ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రధానంగా అమ్మఒడికి సంబంధించి అర్హుల వివరాలు వారికి తెలియజేయడంతో పాటు ఏమైనా గ్రీవెన్స్ వస్తే వాటిని వెంటనే ఆన్‌లైన్ చేయాలని సూచించారు. నాడు– నేడు పనులకు సంబంధించి అప్పగించిన బాధ్యతలను పూర్తి చేయడంలో హెచ్‌ఎంలకు సహకరించాలని కోరారు. ముఖ్యంగా రోజూ ఓ స్కూల్‌ను పరిశీలించి మధ్యాహ్న భోజన పథకం తీరుతెన్నులను పరిశీలించాలని సూచించారు.

### తొలి ఏకాదశికి ప్రత్యేక ఏర్పాట్లు

**ఆత్రేయపురం:** కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణ రాజు తెలిపారు. సాయంత్రం వాతావరణాన్ని అనుసరించి గరుడ వాహన సేవ ఏర్పాటు చేస్తామన్నారు.

### 'జగనన్న సురక్ష'తో అర్హులకు మేలు

**ఆలమూరు:** జగనన్న సురక్ష కార్యక్రమంతో అర్హులకు మేలు జరుగుతుందని మండల ఇన్‌చార్జులు తమ్మన శ్రీనివాసు, నామాల శ్రీనివాసు అన్నారు. మడికిలో సర్పంచ్ యు.లక్ష్మీమౌనిక అధ్యక్షతన బుధవారం సమావేశం జరిగింది. ఎంఏఏఎస్ అధ్యక్షుడు యనమదల నాగేశ్వరరావు, ఎంపీడీఓ కె.జాన్ లింకన్, తహసీల్దార్ ఐపీ శెట్టి పాల్గొన్నారు.

# ప్రతి ఇంటికీ సంక్షేమం

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి
- రావులపాలెంలో గడప గడపకూ..



రావులపాలెంలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

**రావులపాలెం:** వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ సంక్షేమ వసంతం వచ్చిందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. బుధవారం రావులపాలెం సచివాలయం–3 పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో చేసిన మేలును వివరించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు. ప్రజలు తమ సమస్యలను చెప్పిన వెంటనే వాటిని పరిష్కరించే దిశగా చర్యలు చేపడుతున్నామన్నారు. రాష్ట్రంలో ఇది సువర్ణ అధ్యాయమని జగ్గిరెడ్డి అన్నారు. రోజురోజుకూ జగనన్న ప్రజలకు చేరువవుతుంటే, దీనిని చూసి ఓర్వలేని ప్రతిపక్షాలు నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నాయన్నారు. విజ్ఞులైన ప్రజలు అవన్నీ గమనించాలని కోరారు. పేదల సంక్షేమానికి నడుం బిగించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని అందరం కలసి గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం రావులపాలెం పంచాయతీ వెనుక ప్రాంతంలో రజక కమ్యూనిటీ హాలుకు ఎమ్మెల్యే జగ్గిరెడ్డి శంకుస్థాపన చేశారు. అలాగే లక్ష్మీపోలవరంలో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఆయా కార్యక్రమాల్లో జెడ్పీటీసీ సభ్యుడు కుడుపూడి శ్రీనివాసరావు, సర్పంచ్ తాడేపల్లి నాగమణి, ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కర్రి వీర్రెడ్డి, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ బొక్కా వెంకటలక్ష్మి, కార్యదర్శి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### చింతలమోరిలో జేసీ పర్యటన

**మలికిపురం:** చింతలమోరిలో జేసీ ధ్యానచంద్ బుధవారం పర్యటించారు. టూరిజం అభివృద్ధికి చర్యలు తీసుకునే చర్యల్లో భాగంలో ఆయన పర్యటన సాగింది. దీనికి స్థల సేకరణ చేయాలని తహసీల్దార్ నరసింహరావును ఆదేశించారు.

### త్రుటిలో తప్పిన ప్రమాదం

**మలికిపురం:** చింతలమోరికి మోరి మీదుగా వెళుతున్న ప్రైవేట్ విద్యా సంస్థ బస్సు ప్రమాదానికి గురైంది. రోడ్డు మార్జిన్‌లోని ఓ షాపును ప్రమాదవశాత్తు ఢీకొంది. బస్ ముందు భాగం కొంత మేర దెబ్బతింది. అయితే బస్సులోని పిల్లలకు ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. దీనిపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని సఖినేటిపల్లి పోలీసులు తెలిపారు.

### జీరో సినిమా సందడి



మెర్లపాలెంలో సినిమా బృందం

**ఆత్రేయపురం:** మండలంలో జీరో సినిమా చిత్రీకరణ జరుగుతోంది. బుధవారం ఆత్రేయపురంలో హీరో హీరోయిన్‌లు విజయ్‌రాజ్, ఎల్సాలపై పలు సన్నివేశాలు చిత్రీకరించారు.నిర్మాతగా లక్ష్మణరావు, కో డైరెక్టర్‌గా శివ వ్యవహరిస్తుండగా, సాయి కార్తీక్ సంగీతం అందిస్తున్నారు. 50 శాతం చిత్రీకరణ పూర్తయ్యిందని డైరెక్టర్ లక్ష్మీనారాయణ తెలిపారు.

### విద్యా సామగ్రి వితరణ

**ఆలమూరు:** స్థానిక ఖండ్రిగ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు బుధవారం గ్రామానికి చెందిన వ్యాపారవేత్త రావాడ నరేష్ విద్యా సామగ్రి అందజేశారు. హెచ్ఎం అద్దరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

### రాజుకు ప్రతిభా అవార్డు



అవార్డు అందుకుంటున్న ఎన్‌సీసీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ రాజు, ప్రాజెక్ట్ డైరెక్టర్ సంజయ్

**సఖినేటిపల్లి:** స్థానిక గీతామందిరం ప్రాంతానికి చెందిన ఎన్‌సీసీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆర్ఎస్ రాజు మౌళిక సదుపాయాలు, నిర్మాణ రంగ విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభకు గాను 2022 కాస్ట్ మేనేజ్‌మెంట్‌లో అవార్డు అందుకున్నారు. జాతీయ స్థాయిలో ఐసీఏఐ ఆధ్వర్యంలో ఏటా ఇచ్చే అవార్డుల్లో భాగంగా ఇటీవల న్యూఢిల్లీ విజ్ఞాన భవన్‌లో ఈ అవార్డును స్వీకరించారు. సుమారు 25 ఏళ్ల కిందట నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ (ఎన్‌సీసీ)లో చేరి, అంచెలంచెలుగా డైరెక్టర్ ప్రాజెక్ట్స్ స్థాయికి ఆయన ఎదిగారు. విజ్ఞాన్ భవన్‌లో ఎక్సలెన్స్ అవార్డు తీసుకున్న ఎన్‌సీసీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆర్ఎస్ రాజుతో పాటు డైరెక్టర్ (ప్రాజెక్ట్) సంజయ్, సీఎఫ్ఓ ఎం.శ్రీనివాసరావు ఉన్నారు. ఆయనకు సఖినేటిపల్లి, మలికిపురం మండలాల ప్రజలు బుధవారం శుభాకాంక్షలు తెలిపారు.

### ఆత్రేయపురం ఎస్సైగా కిరణ్‌కుమార్



**ఆత్రేయపురం:** స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్సైగా బీవై కిరణ్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. భీమవరం నుంచి ఆయన ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. దీనికి ప్రజలు సహకరించాలని కోరారు.

### రైతు బజారులో మరిన్ని దుకాణాలు

**ఆలమూరు:** స్థానిక రైతుబజార్‌లో మరిన్ని దుకాణాలు ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు వస్తామని తహసీల్దార్ ఐపి.శెట్టి అన్నారు. ఇటీవల వ్యవసాయ మార్కెట్ కమిటీ ద్వారా రూ. 20 లక్షలతో స్థానిక బస్టాండు ఎదురుగా నిర్మించిన రైతు బజార్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. ఇన్‌చార్జి ఎస్టేట్ అధికారి జి.సుబ్రహ్మణ్యాన్ని ధరల నిర్ణయంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

### భగవద్గీతపై ప్రచారం

**మామిడికుదురు:** గురు పౌర్ణమికి ఆరాధ్యుడు శ్రీకృష్ణ భగవానుడని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక మామిడికుదురు కమిటీ అధ్యక్షుడు బండారు సత్యనారాయణ అన్నారు. బుధవారం మొగలికుదురులో ఇందూ ధర్మ ప్రచారం నిర్వహించారు. హనుమంతరావు, అభిమన్యురాజు, బ్రహ్మాజీ, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

### హత్య చేశారని ఫిర్యాదు

**కొత్తపేట:** తమ కుమారుడు మేడిశెట్టి శ్యామ్ మణికంఠ రామ్‌ప్రసాద్‌ది ఆత్మహత్య కాదని, గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేసి ఉంటారని మృతుని కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేశారు. ఈ మేరకు అతని తల్లిదండ్రులు మేడిశెట్టి సీత, శ్రీనివాసరావు, సోదరి బేబీపద్మిని బుధవారం స్థానికంగా డీఎస్పీకి ఫిర్యాదు చేశారు. కాట్రేనికోన మండలం కొప్పిగుంట గ్రామానికి చెందిన రాంప్రసాద్ మోడేకుర్రులో అతని పెద్దమ్మ ఇంట్లో ఈ నెల 24 రాత్రి ఉరి వేసుకుని వేలాడుతుండగా 25న ఉదయం స్థానికులు గుర్తించిన విషయం తెలిసిందే. దీనిపై పోలీసులు ఆత్మహత్యగా కేసు నమోదు చేశారు. శ్యామ్‌ది హత్యగా అనుమానం ఉందని మృతుని కుటుంబ సభ్యులు స్థానిక టీడీపీ నాయకులతో కలసి డీఎస్పీకి ఫిర్యాదు అందించారు.

### రోడ్ల ప్రగతికి నిధులు



రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాదరావు

**మలికిపురం:** అడవిపాలెంలో రోడ్డు నిర్మాణ పనులను బుధవారం ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు పరిశీలించారు. నియోజకవర్గంలో రహదారుల ప్రగతికి ప్రభుత్వం ప్రాధాన్య క్రమంలో నిధులు మంజూరు చేస్తుందన్నారు. ఆయన వెంట పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

### రుణాల మంజూరుకు వినతి

**అంబాజీపేట:** జిల్లాలోని రైతులకు దీర్ఘకాలిక రుణాలను మంజూరు చేయాలని డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజును పలువురు కోరారు. కాకినాడలో జరిగిన డీసీసీబీ మహాజన సభలో అంబాజీపేట మండల సొసైటీల చైర్మన్లు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని డీసీసీబీ బ్యాంకును అమలాపురం డివిజన్‌లో ఏర్పాటు చేస్తే రైతులకు మరింత సేవలందించవచ్చన్నారు. ఇరుసుమండ సొసైటీ నూతన భవన నిర్మాణానికి సహకరించాలని కోరారు. చైర్‌పర్సన్లు దొమ్మేటి సత్యమోహన్, నందుల ఆదినారాయణ, నాగాబత్తుల సత్యానందరావు, బొంతు శ్రీను, డైరెక్టర్ దొమ్మేటి రాధా సూర్యనారాయణ పాల్గొన్నారు.

### వాసన భరించలేకపోతున్నాం

**అంబాజీపేట:** ఆరుబయట కొబ్బరికి పెడుతున్న సల్ఫర్ నుంచి వచ్చే దుర్వాసన భరించలేకపోతున్నామని అరటి వ్యాపారులు, రైతులు అన్నారు. బుధవారం స్థానిక మార్కెట్ యార్డ్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. యార్డులో అరటి వ్యాపారం చేసుకునేందుకు ఓ షెడ్డును పూర్తిగా వినియోగిస్తుంటే.. మరో షెడ్డులో అరటి గెలల ఎగుమతి, నిల్వ చేసుకునేందుకు వాడుతున్నామన్నారు. ఆ షెడ్డులో ఆరుబయట కొబ్బరి బస్తాలను బరకాలతో కప్పి సల్ఫర్ పెడుతున్నారన్నారు. దీని నుంచి దుర్వాసన వెదజల్లడంతో అరటి లోడు చేసుకునేందుకు, గెలలు కొనుగోలుకు, నిల్వ ఉంచేందుకు రైతులు చర్చించుకునేందుకు, సమావేశాల సమయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు.

### కమ్యూనిటీ హాలు నిర్మించాలి

**కొత్తపేట:** స్థానికంగా నాయీ బ్రాహ్మణులకు కమ్యూనిటీ హాలు నిర్మించాలని సంఘ సభ్యులు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డికి వినతిపత్రం సమర్పించినట్టు సంఘ గౌరవాధ్యక్షుడు కింతాడ సత్యనారాయణ, అధ్యక్షుడు కింతాడ శ్రీనివాసరావు బుధవారం విలేకరులకు తెలిపారు. ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి మంజూరుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారని వారు అన్నారు. సంఘ ఉపాధ్యక్షుడు మల్లువలస సోమేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి గొలజాపు శ్రీరాములు, కోశాధికారి గోలజాపు ఈశ్వరరావు పాల్గొన్నారు.

### విత్తనశుద్ధితో అధిక దిగుబడి

**అంబాజీపేట:** బీజామృతంతో విత్తనశుద్ధి చేయడం వల్ల తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొందవచ్చని ప్రకృతి వ్యవసాయ ఇన్‌చార్జి నాగవరపు శ్రీనివాసరావు అన్నారు. బుధవారం పుల్లేటికుర్రులో బీజామృతం తయారీ, విత్తన శుద్ధిపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. డిజిటల్ ఎల్ఐ వీరబాబు, ఐసీఆర్పీలు పరమటి సత్యమణి, జొన్నా కనకలక్ష్మి, చిత్రపు దామోదరరావు పాల్గొన్నారు.

### కుష్ఠు వ్యాధిపై అవగాహన

**ఆలమూరు:** కుష్ఠు వ్యాధి నివారణకు అంతా చైతన్యవంతంగా సాగాలని జిల్లా వైద్యారోగ్యశాఖ కుష్ఠు వ్యాధి నివారణ ప్రత్యేక అధికారి శిరీష అన్నారు. బుధవారం స్థానిక బొబ్బా జయశ్రీ బాలికోన్నత పాఠశాలలో హెచ్ఎం పి.వెంకటలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశానికి శిరీష హాజరై మాట్లాడారు. మండలంలోని మిగతా పాఠశాలల్లో సీహెచ్ఓ పి.రాధాకృష్ణ, హెల్త్ ఎడ్యుకేటర్ ఏవీవీ రాజా అక్కుల, సూపర్‌వైజర్లు పీవీ రమణారావు, పి.ఉమ తదితరులు విద్యార్థులకు అవగాహన కల్పించారు.

### తక్కువ ధరకే మందులు

**మామిడికుదురు:** జనరిక్ మెడికల్ షాపుల ద్వారా తక్కువ ధరకే మందులు అందించే విధంగా ప్రధాని మోదీ చర్యలు తీసుకున్నారని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీ వేమా అన్నారు. గృహ సంపర్క్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరిస్తూ ఆ పార్టీ నేతలు బుధవారం మామిడికుదురులో ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంచారు. పార్టీ నేతలు కటికిరెడ్డి తమ్మయ్యనాయుడు, బైరిశెట్టి రామకృష్ణ, కటికిరెడ్డి గంగాధరమ్ పాల్గొన్నారు. **పి.గన్నవరం:** ప్రధాని మోదీ పాలనలో దేశం ఎంతో అభివృద్ధి చెందిందని నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ చెరుకూరి గోపాలకృష్ణ అన్నారు. మోదీ తొమ్మిదేళ్ల పాలనలో జరిగిన అభివృద్ధిని వివరిస్తూ ముద్రించిన కరపత్రాలను కె.ముంజవరంలో బుధవారం ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అందజేశారు. మండల పార్టీ అధ్యక్షుడు సాయిబాబు పాల్గొన్నారు.

### కాలువలో పడి వృద్ధుడి మృతి

**కొత్తపేట:** స్థానిక సంతోష్‌నగర్‌కు చెందిన చోడపనీడి గోవిందరావు (68) బోడిపాలెం సమీపంలోని కేదార్లంక లంక భూమిలో పూల సాగుతో పాటు స్థానిక పాతబస్టాండ్ సెంటర్‌లో పూల వ్యాపారం చేసుకునేవాడు. బుధవారం అతను పూలతోటకు వెళ్లి తిరిగి వస్తూ బోడిపాలెం వంతెన వద్ద పంట కాలువలో స్నానానికి దిగి మునిగిపోయి మృతిచెందాడు. అదనపు ఎస్సై శశాంక కేసు నమోదు చేశారు.